క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయస్వామి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి వార్షికోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉదయం నుంచి స్వామివారికి పొంగళ్లు తయారు చేసి నివేదించారు. స్వామి వారికి ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం చేశారు. శనివారం రాత్రికి కోలాటం ప్రదర్శించారు.

ఆలయాల్లో భక్తుల సందడి


రామదూత క్షేత్రంలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు లక్ష్మీఅలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పుల్లలచెరువు ప్రభుత్వ ఆస్పత్రి

వాతావరణంలో మార్పులతో అవస్థలు

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి

పుల్లలచెరువు: ఇటీవల వాతావరణం భిన్నంగా ఉంటోంది. మధ్యాహ్నం వరకు మండుటెండ ఉంటూ అప్పటికప్పుడు ఆకాశం మేఘావృతమై వర్షం పడుతోంది. కొన్ని రోజులుగా ఎండ వేడిమితో పాటు ఉక్కపోత అధికమైంది. ఉదయం 7 గంటకల్లా భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం 5 అయ్యే సరికి చల్లబడి గాలులు వీస్తున్నాయి. ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. ఈ విధంగా హఠాత్తుగా జరిగే వాతావరణ మార్పులతో చిన్నిపిల్లలు, వయసు మళ్లిన వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పులతో ఎదురయ్యే సమస్యలు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు పలు సూచనలు సూచిస్తున్నారు.

ఇబ్బందులు ఇవే..

ఒకేరోజు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు పడుతూ చల్లబడిన వాతావరణంతో మొక్కల నుంచి పుప్పొడి రేణువులు గాలిలో కలుస్తాయి. దీంతో ఆస్తమా, ఎలర్జీ, గొంతునొప్పి, తుమ్ములు ఎక్కువగా రావడం, న్యూమోనియా, బ్రాంకైటీస్, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత, తేమ ఉన్నప్పుడు చెమట పట్టి ఫంగస్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ రావడానికి అవకాశం ఉంటుంది. నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెంది వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మైగ్రేన్ వంటి సమస్యలు ఉన్న వారికి మరింత ఇబ్బందిగా ఉంటుంది. చిన్న పిల్లలు, వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో త్వరగా వడదెబ్బకు గురవుతారు. సోడియం, పోటాషియం లవణాల సమతుల్యతలో తేడా ఏర్పడి ఇబ్బంది పడతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి. దీంతో గాలి నుంచి వచ్చే ఇన్‌ఫెక్షన్‌లను నివారించవచ్చు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. వృద్ధులు మండుటెండలో తిరగకూడదు. రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి. నూనె పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. దాహం వేయకున్నా ప్రతి అరగంటకు కొద్దిగా మంచి నీరు తాగుతూ ఉండాలి. రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు విటమిన్–సి ఎక్కువగా ఉండే సిట్రస్ పళ్ల రసాలు, తాజా కూరగాయలు తీసుకోవాలి.



అశ్రద్ధ చేయవద్దు:
జ్వరం, బలహీనత, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయవద్దు. ఇలాంటి సమయంలో సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించి వైద్యసేవలు పొందాలి. వైద్యులు సూచించిన మందులు మాత్రమే వాడాలి. సామాజిక మాధ్యమాల్లో చూసిన వాటిని అనుసరించకూడదు. అందరి శరీర తత్వాలు ఒకేలా ఉండవు. తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.
– డాక్టర్ లక్ష్మీనరసింహం, ప్రభుత్వ వైద్యాధికారి, పుల్లలచెరువు

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


యర్రబాలెంలో ముస్తాబైన పోలేరమ్మ గుడి

దొనకొండ: మండలంలోని యర్రబాలెంలో గ్రామస్తులు ఐక్యంగా అల్లూరి పోలేరమ్మ, ఊర పోలేరమ్మ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి శుక్రవారం శిలలను జలపాతంలో కలిపారు. శనివారం శిలలను పురవీధుల్లో భజంత్రీలతో ఊరేగించారు. మహిళలు తలంటి స్నానాలు చేసి గ్రామ దేవతలకు పొంగళ్లు చేసి నైవేద్యం సమర్పించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు శిలలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మద్యం షాపు వద్ద ఎక్సైజ్ సిబ్బంది

దర్శి (కురిచేడు): మద్యం దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. నియోజకవర్గంలోని 23 మద్యం షాపుల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా వ్యాపారం జరుపుకోవాలని సూచించారు. మద్యం షాపుల ముందు అన్ని రకాల బ్రాండ్లు, వాటికి సంబంధించి ఎమ్మార్పీలు తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు షాపులు నిర్వహించాలన్నారు. ముందుగా షాపులు తెరిచినా, ఆలస్యంగా మూసివేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనధికారిక విక్రయాలు జరిపుతున్నట్లు సమాచారం ఉందని, వాటిపై దాడులు చేస్తామని స్పష్టం చేశారు. మద్యం షాపుల వద్ద లూజు విక్రయాలు, గదుల నిర్వహణ, సమయపాలన సక్రమంగా నిర్వహించేందుకు షాపుల వద్ద సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే


బోరులో నీరు పడాలని దేవుడిని కోరుకుంటున్న ఎమ్మెల్యే తాటిపర్తి


పశువుల తొట్టిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు: మండలంలోని నాయుడుపాలెం ఎస్సీ పాలెంలో చాలా సంవత్సరాల నుంచి మంచినీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి విషయాన్ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మను కలిసి నాయుడుపాలెంలో మంచినీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. రూ.7 లక్షలు మంజూరు చేయించి రెండు బోర్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా శనివారం నాయుడుపాలెంలో మంచినీటి బోరు వేసేందుకు టెంకాయ కొట్టి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రారంభించారు. సమస్యను పరిష్కరించినందుకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనుల్లో నాణ్యత లోపం

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న పశువుల మంచినీటి తొట్లు నాణ్యంగా ఉండేలా పనులు చేయాలని, నాణ్యత లోపాలు బాగా ఉన్నాయని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని నాయుడుపాలెం పరిసర ప్రాంతాల్లో నిర్మించిన పశువుల మంచినీటి తొట్లను పరిశీలించారు. తొట్టి మొత్తం నెర్రెలిచ్చి నాణ్యత లోపం ఉండటాన్ని గుర్తించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి పనులు సక్రమంగా చేయాలని, ప్రజలకు ఉపయోగ పడకుండా కేవలం డబ్బులు ఖర్చు చేయడమే పనిగా పెట్టుకోవద్దని, పనులు నాణ్యంగా ఉండేలా చేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదని, కేవలం ఎంపీడీవోల కనుసనుల్లోనే పనులు జరుగుతున్నాయన్నారు. కొన్ని పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని, వైఎస్సార్ సీపీ నాయకులకు బిల్లులు చేస్తే ఇబ్బందులు పడతారని క్షేత్రస్థాయి సిబ్బందిని కూటమి నాయకులు బెదిరిస్తున్నారని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. త్వరలో నియోజకవర్గంలో ఉపాధి పనులు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నాణ్యత లోపాలతో పనులు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే తాటిపర్తి హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్‌లు కోటిరెడ్డి, రమణారెడ్డి, మండల నాయకులు సుబ్బారెడ్డి, గడ్డం సుబ్బయ్య, రాజు, బసివిరెడ్డి పాల్గొన్నారు.

రైతులను పట్టించుకున్న నాథుడే కరువు

దొనకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నేటికీ రైతులను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడి పోతున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వేలకు వేలు ఖర్చు చేసి మిర్చి సాగు చేశారని, కూలి రేట్లు విపరీతంగా పెరిగాయని, గుంటూరు మార్కెట్ యార్డులో పూర్తిగా ధర పడిపోయిందని, రైతు కన్నీళ్లతో ఇంటికి వస్తున్నాడని, నాలుగేళ్లల్లో మిర్చి కనిష్ఠ ధర రూ.19 వేలు, గరిష్ఠ ధర రూ.23 వేలు పలికిందని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరలు పూర్తిగా తగ్గిపోయాయని, వచ్చే ఏడాది వ్యవసాయం చేసేందుకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. దొనకొండ మెట్ట ప్రాంతం కావటంతో ఈ ఏడాది విపరీతంగా ఖరీఫ్ సీజన్‌లో పొగాకు సాగు చేశారని, వేలకు వేలు ఖర్చు చేసి పొగాకు బేళ్లను కంపెనీలకు తీసుకెళ్తే బయ్యర్లు తేమ శాతం ఎక్కువ ఉందని తిరిగి వెనక్కి పంపుతున్నారని పేర్కొన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ప్రజా పక్షపాతి అని, ప్రజల కష్ట సుఖాలు ఆయనకు తెలుసని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఈ నెల 28వ తేదీన పొదిలి పొగాకు వేలం కేంద్రానికి జగనన్న విచ్చేస్తున్నాడని, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కృష్ణారెడ్డి కోరారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. 13/2023 in IA 888/2018 in O.S. 106/2017

గంధం రమణయ్య ... DHR

VS

పిడతల పడిపి రామయ్య (Died)
రామక్రిష్ణుడు మరియు ఇతరులు ... JDR'S

పై నెంబరు E.P ని D.H.R. కు రావలసిన బాకీ వసూలు నిమిత్తం ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని వేలం వేయుటకు గాను E.P ని దాఖలు చేసి ఉన్నారు. కావున ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై కోర్టు ఎదుట 17-06-2025వ తేదీన బహిరంగ వేలం జరుగుచున్నది. DHR షెడ్యూలు ఆస్తికి చెందిన E.C మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ అన్ని దాఖలు చేసి ఉన్నారు. షరతులు వర్తిస్తాయి. కొనుగోలు చేయదలచిన వారు పాటలో పాల్గొనవలసినది.

షెడ్యూలు : Prakasam District - Giddalur Sub District RCC Midde and Vacant Site Situated With in the limits Giddalur Grama Panchayat in 8th Ward, 17 Block in Pamulapalli rastha Bearing D.No. 8-17-127/25 Boundaries. **EAST** : Midde Balongs to Pidathala Peraiah, **South** : Bazaar Rastha, **North** : Site belongs to Pidathala Ravi, **West** : Midde Balongs to Pidathala Pedda Ramaiah.

With in the above boundaries East - West Measuring 14 1/2 Feet and North to South 52 Feet ie., 754 SQ Feet or 83.777 SQ Yards or 70.049 SQ Maters site and RCC Roofed Building built in 594.5 SQ Feet i.e, East - West Measuring 14 1/2 Feet and North - South Measuring 41 feet, With doors, door frames etc, wood work and Joint half right in east - west walls and site on which the walls built with current meter bearing S.C No. 3388 with current wires and full rights in the steps situated on the eastern side of the midde S.No.143

DHR వాల్యూ Rs. 8,00,000-00, అమీన వాల్యూ Rs. 10,00,000-00
మార్కెట్ వాల్యూ Rs. 12,51,185-00

వేలం తేది : 17-06-2025,
F.Hg - 24-06-2025

S.B.K.D.K.V. PRASADA RAO, B.A., B.L
Advocate & Notary Public
Markapur- 523316, Prakasam Dist. A.P
Cell : 9959175288

2వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభం


దొనకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూన్ 2వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపాల్ కె.దుసుమణి తెలిపారు. ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, కళాశాల ఏర్పాటు చేసి 42 సంవత్సరాలు కావస్తోందని, ఉత్తమ ఫలితాలతో విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. పశ్చిమ ప్రాంతంలోని వెనుకబడిన దొనకొండ ప్రాంతం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

అదుపుతప్పి లారీ బోల్తా


బోల్తా పడిన కూరగాయల లోడు లారీ

పెద్దారవీడు: మండలంలో దేవరాజుగట్టు సమీపంలో కూరగాయల లారీ అదుపుతప్పి శనివారం బోల్తా పడింది. మదనపల్లె పట్టణం నుంచి ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్‌కు వెళ్తున్న లారీ దేవరాజు గట్టు సమీపంలోకి రాగానే అదుపుతప్పి పడటంతో బాక్స్‌ల్లో ఉన్న టమోటాలు నేలపాలయ్యాయి. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వారిని వెంటనే స్థానికులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వీధిలైట్లు లేక ఇబ్బందులు


చీకటి కమ్ముకున్న బొద్దికూరపాడు బస్టాండ్ సెంటర్

తాళ్లూరు: దర్శి నియోజకవర్గంలో వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పంచాయతీల్లో తూర్పు గంగవరం ముందు వరసలో ఉంటుంది. అలాంటి పంచాయతీలో పలు వీధుల్లో స్తంభాలకు ఉన్న వీధి లైట్లు వెలగగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన వాణిజ్య కేంద్రమైన తూర్పుగంగవరంలో రాత్రి వేళల్లో ప్రజలు తమ అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. దీనిలో భాగంగా బొద్దికూరపాడు బస్టాండ్ సెంటర్ నుంచి హైస్కూల్ వరకు స్తంభాలకు వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళ చీకట్లు కమ్ముకుంటున్నాయి. వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వైద్యం కోసం వస్తున్న మహిళలు, వృద్ధులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు వెంబడి ఆనుకుని ఉండే ఇళ్లల్లో నుంచి వచ్చే వెలుతురుతో ప్రజలు ఆ రోడ్డు మార్గాన వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతుల బతుకులు ఛిద్రం

- ప్రజల ధనాన్ని కొల్లగొడుతున్న టీడీపీ గూండాలు
- దోచుకుంటున్న ఇసుక, మట్టి, రేషన్ బియ్యం
- 28న పొదిలిలో జగనన్న పోరుబాటకు రైతన్నలు తరలిరావాలి
- వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వంలో రైతుల బ్రతుకులు ఛిద్రం అయ్యాయని, కాయకష్టం చేసి పండించిన ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లభించలేదని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారులను ప్రోత్సహించేందుకు ఆక్వా కల్చర్‌ను నిర్వీర్యం చేశారని, వాటి మేత ధరలను తట్టుకోలేక ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రైతులను ప్రోత్సహించేందుకు రొయ్యల మేతకు ఉపయోగపడే సోయాబిన్ గింజలు కిలో ధర రూ.90 నుంచి రూ.100 వరకు ఉన్నప్పటికీ మేత ధర కూడా అదే స్థాయిలో నిలకడగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారని, ధరల స్థిరీకరణ కోసం రూ. 3 వేల కోట్లు కేటాయించి రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు పశువుల వైద్యం కోసం అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారని, ఇన్సూరెన్స్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సోయాబిన్ గింజ ధర కిలో రూ.24కు పడిపోయినప్పటికి, మేత ధరలో మాత్రం మార్పు రాలేదని, ఆ ధరను తాము తట్టుకోలేక పోతున్నామని, కనీసం కిలోకు రూ. 40 తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు గగ్గోలు పెట్టినా కేవల రూ.4లు తగ్గించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. చేసేదిలేక ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించిందని పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని టీడీపీ దొంగల ముఠా తమ గుప్పెట్లో పెట్టుకొని కూలీల కష్టాన్ని దోచేసుకుంటోందని, యర్రగొండపాలెం నియోజకవర్గంలో వారానికి రూ.3 కోట్లు వరకు కొల్లగొడుతున్నారన్నారు. అధికారం ఉందని పచ్చ బూచోళ్లు పోలీసులను అడ్డం పెట్టుకొని ఇసుక, మట్టి, రేషన్ బియ్యాన్ని దోచుకొని పబ్బం గడుపుకుంటున్నారని, ప్రజల సొత్తును దోచుకోమని చంద్రబాబు ప్రోత్సహిస్తున్నాడా.. అని ప్రశ్నించారు. గుక్కెడు నీళ్లు ఇవ్వండని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లు ఎక్కుతుంటే అది రాజకీయ డ్రామా అనడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో దాదాపు 560 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని, అందులో దాదాపు 420 ట్యాంకర్లు వై.పాలెం నియోజకవర్గానికి కేటాయించారని, అందులో కేవలం కూటమి నాయకులు అరకొరగా నీటిని తోలి బిల్లులు చేసుకుంటున్నారని విమర్శించారు. నీటి తీవ్రత ఎక్కువగా ఉన్న నియోజకవర్గాన్ని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చేర్చకపోతే ఇక్కడ ఉన్న టీడీపీ నాయకులు నోరుకూడా మెదపలేదన్నారు. నియోజకవర్గాన్ని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చేర్చితే అక్రమంగా నీటి బిల్లులు చేసుకునేందుకు వీలుండదన్న ఉద్దేశంతోనే అధికార పార్టీకి చెందిన నాయకులు అందుకు వ్యతిరేకిస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. రైతన్నలకు అండగా పొదిలిలో ఈ నెల 28న జరిగే జగనన్న పోరుబాటకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయా సమావేశాల్లో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మజీద్, పార్టీ మండల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి, వివిధ విభాగాల నాయకులు కె.ఓబులరెడ్డి, ఎం.బాలగురవయ్య, ఆళ్ల ఆంజనేయరెడ్డి, గుమ్మా ఎల్లేష్ యాదవ్, సయ్యద్ జబీవుల్లా, ఆర్.అరుణాబాయి, సరళ, వెన్నా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కంభం: మండలంలోని ఎల్‌కోట గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో వీరభద్రాచారి తనిఖీ చేశారు. హాజరుపట్టి, మూవ్‌మెంట్ రిజిస్టరు, ఇతర రికార్డులు పరిశీలించారు. యోగాంధ్ర సర్వేపై సిబ్బందికి సూచనలందించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతున్న కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు.